క్లుప్తంగా

మురుగుతో ఇబ్బందులు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలచిపోయిన వర్షపు నీరు, మురుగు

పాలకొండ రూరల్: నిత్యం వందల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మురుగు సమస్య వేధిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండటంతో పాటు సరైన డ్రైనేజీ వ్యవస్థను నిర్వహించకపోవటంతో ఇబ్బందులు పేరుకుపోతున్నాయి. కాంప్లెక్స్ వెనుక భాగంలో కాలువల్లో పూడిక నిండిపోవటంతో నీరు నిలిచిపోతోంది. దీంతో సమీప పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగటంతో మురుగు పేరుకుపోయింది. ఈ క్రమంలో దోమలు, దుర్గంధం, విష సర్పాలు, కీటకాలు, కుక్కలు, పందులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం వద్దు



సచివాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీపై సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: పింఛన్ల పంపిణీలో సిబ్బంది ఎటువంటి అలసత్వం చూపొద్దని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ స్పష్టం చేశారు. మండలంలో 22 సచివాలయాలకు చెందిన సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో 32 పంచాయతీలకు సంబంధించి 7,415 మంది సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వారికి సంబంధించి రూ.4,99,00,652 లు నగదు అర్హుల ఇంటి వద్దనే అందించాలన్నారు. సచివాయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 192 మంది సిబ్బంది జూన్ ఒకటో తేదిన ఉదయం 6 గంటల నుంచి కచ్చితంగా పింఛన్లు బట్వాడా చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

320 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ రూరల్: రాజీయే రాజమార్గమని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి విజయ రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 320 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

దుర్గారావు సేవలు అభినందనీయం



దుర్గారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కొప్పర దుర్గారావు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన దుర్గారావును స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.జయప్రకాష్, డీటీ సత్యనారాయణ, ఆర్ఐ లక్ష్మంనాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



జియ్యమానుగూడలో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

భామిని: వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. బత్తిలి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదరరావు, సబ్‌యూనిట్ అధికారి పి.అప్పారావు పనులను పర్యవేక్షించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు.

ఆర్గానిక్ సాగుతో అధిక ఆదాయం

- మెట్ట భూముల్లో కూరగాయ పంటల సాగుకు రాయితీలు
- సేంద్రియ పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్



పందిరి సేద్యానికి సంబంధించి రాయితీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు (ఫైల్)

పాలకొండ రూరల్: కాయగూరలు సాగు చేసే రైతులు ఆర్గానిక్ విధానంపై దృష్టి సారించినట్లయితే మేలైన దిగుబడులు పొందవచ్చు. ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తుండటంతో మెట్ట ప్రాంతాల రైతులు కూడా కాయగూరల పంటలు పండించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 23 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఉద్యానవన అధికారులు తెలిపారు. గతంతో పోల్చుకుంటే ఈ సారి ఆర్గానిక్ పంటల సాగు, వినియోగంపై రైతుల్లో, ప్రజల్లో మక్కువ పెరగటం మంచి పరిణామం. ఈ తరహా కాయగూరలకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. దీనికి తోడు ఉద్యానవన శాఖ నుంచి రాయితీలు అందిస్తుండటంతో ఔత్సాహిక రైతులు ఆర్గానిక్ పద్ధతిలో పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

శాఖాపరమైన ప్రోత్సాహం

హార్టీకల్చర్ ద్వారా రైతు సాగుచేసే పంటలకు హెక్టారుకు రూ.3వేలు సబ్సిడీ అందజేస్తుంది. సిమ్మెంట్ స్తంభాలతో పందిర్లు వేసుకునేందుకు రూ.లక్ష ఇస్తున్నారు. విత్తనాలు వేసిన తరువాత ప్లాస్టిక్ కవర్లతో కప్పి ఉంచేందుకు ఎకరాకు రూ.20 వేలు అందజేస్తారు. అలాగే ప్లాస్టిక్ ట్రేలను కూడా అధికారులు సమకూర్చటంతో రైతులు కూరగాయలు పండించేందుకు ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా పందిరి సాగుతో దొండ, బీర, గోరుచిక్కుడు, ఆనప, దోస తదితర తీగజాతి పంటలు వేస్తున్నారు. ఆసక్తి గల రైతులు సొంత నిధులు ఖర్చుచేసి ముందుగా కూరగాయలు సాగు ప్రారంభించాలి. అటుపై ఉద్యానవన శాఖ అధికారులను, రైతు భరోసా కేంద్రాల్లో రైతులు వారు పండిస్తున్న పంటల వివరాలు తెలియజేయాలి. ఈక్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రాయితీలు వర్తించేలా సిఫార్సు చేస్తారు. జిల్లాలో 15 మండలాల్లో ఈ విధానం అమలవుతోంది. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రైతులు కాయగూర పంటలు పండించేందుకు ఎంతో అనుకూలం. రైతు వేసే పంటల్లో సస్యరక్షణ, సాగు విధానంపై శాఖాపరంగా అవసరమగు సూచనలు, సలహాలు అందించేలా తాము సిద్ధంగా ఉన్నమని అధికారులు చెబుతున్నారు.



పాలకొండ మండలం గరుగుబిల్లిలో పందిరి సేద్యం

సేంద్రియ విధానం మేలు



సేంద్రియ విధానంతో పండించే పంటల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయి. వాటిలో ఎటువంటి కెమికల్ ఎరువుల వాడకం ఉండకపోవటంతో శరీరానికి మేలు చేకూరుస్తాయి. ఔత్సాహిక రైతులు శాఖా పరంగా అందిస్తున్న రాయితీలను అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కాయగూరలకు మంచి డిమాండ్ ఉంది. అలాగే ప్రస్తుత సీజన్‌లో జీడి, మామిడి తోటలు వేసే రైతుల కోసం మెక్కలు సిద్ధం చేశాం. అవసరమైన రైతులు అధికారులను సంప్రదించాలి.

– తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారి, పాలకొండ

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఐఈఆర్‌టీలు

గరుగుబిల్లి: డీఎస్సీ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను ఐఈఆర్‌టీలకు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ఏపీ ఐఈఆర్‌టీ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు శనివారం వినతి పత్రం అందజేశారు. 2001 నుంచి పనిచేస్తున్న ఐఈఆర్‌టీలకు పోస్టుల భర్తీలో ప్రాధాన్యమిచ్చేలా చూడాలని ఎమ్మెల్యేను వారు కోరారు. కార్యక్రమంలో జి.జనార్దన్, జి.అరుణ, పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, మండలంలోని చినగుడబ రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న మైనింగ్ తవ్వకాల కారణంగా ఎగసిపడుతున్న దుమ్ము, ధూళితో చినగుడబ, గదబవలస, కొంకడివరం తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు జనసేన పార్టీ నాయకులు ఎ.శంకరరావు, కె.అరుణ్ కుమార్, భుజంగరావులు వినతిపత్రం అందజేశారు.

జీవో నంబర్ 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ అన్నారు. మండలంలోని నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో తిరిగి చేర్చాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలన్నారు. 12వ పీఆర్‌సీ అమలు ఆలస్యం అవుతున్నందున మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎ.మహేశ్వరరావు, మండల కార్యదర్శులు రమణ, మన్మధరావు, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

97 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన యువత

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 97 మంది నిరుద్యోగులకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కేఎల్ గ్రూపు, అమేజాన్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాకు మొత్తం 147 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 97 మందిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, వైటీసీ ఇన్‌చార్జ్ వెంకటరమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులను అందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు కొరత లేకుండా ఎరువులు అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని కత్తుల కవిటి రైతు సేవా కేంద్రం వద్ద శనివారం పలువురు రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు.. ఎరువుల కొరత లేకుండా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ కె.రత్నకుమారి, ఏఓ జె.సౌజన్య, నాయకులు నిమ్మక పాండురంగ తదితరులున్నారు.

మాకు న్యాయం చేయండి



డీడీకి వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

సీతంపేట: తమకు న్యాయం చేయాలని కోరుతూ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు శనివారం సీతంపేట ఐటీడీఏను ఆశ్రయించారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులంతా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెగా డీఎస్సీలో తమ పోస్టులు కలపడంతో తామంతా వీధిన పడతామన్నారు. మొత్తం 1143 పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానం నుంచి కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్, జేఎల్‌లుగా మార్చాలన్నారు. గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాదికి సంబంధిత తమను ఇప్పటి వరకు రెన్యువల్ చేయలేదని వాపోయారు. 2022 పీఆర్‌సీలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు వేతనం పెరిగితే తమకు మాత్రం పెరగలేదన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు బిడ్డిక గణేష్, మోహనరావు, ఈశ్వరి, భవాని, ధర్మారావు, క్రాంతి, బాబూరావు, సింధు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

- ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆలయాన్ని శనివారం సందర్శించిన ఆమెకు ఆలయ అర్చకులు వి.వి.అప్పలాచార్యులు పూర్ణకలశంతో స్వాగతం పలికి, పూజలు చేసి, స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆమె స్వామి వారికి పట్టువస్త్రాలు బహూకరించారు. ఆ తర్వాత ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర చినతిరుపతిగా పేరొందిన ఈ ఆలయానికి పూర్వవైభవం తీసుకువస్తానని అన్నారు. ఆలయ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం అన్నదాన సత్రానికి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వి.పారినాయుడు, ఎ.కన్నయ్య, పకీరునాయుడు, వాసునాయుడు, సర్పంచ్ ఎ.సింహాచలమమ్మ, ఎంపీటీసీ ఎం.సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు

సీతానగరం: మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం నుంచి అజ్జాడ వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గోతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే రూ. 60 లక్షలతో శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యం, ఆర్. వేణుగోపాలనాయుడు, పార్వతీపురం పట్టణ పార్టీ నాయకులు బర్నాల సీతారాం, సీతానగరం నాయకులు టి. వెంకటప్పలనాయుడు, ఎస్. శ్రీనివాసరావు, సర్పంచ్‌లు టి. చంద్రశేఖర్, జె. తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్ కుమార్, బి. శ్రీనివాసరావు, ఎం. శంకరరావు, ఆర్అండ్‌బీ ఏఈ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చేనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికేట్లు పరిశీలన చేయించుకోవాలని సూచించారు. జూలై 27న సీతంపేట ఐటీఐలో ఉదయం 10 గంటలకు అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, కోపా, డ్రెస్‌మేకింగ్, ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 9390063881, 9491134464కు ఫోన్ చేయాలని కోరారు.

పెద్దగోర్జి పనులకు ఆటంకాలు తొలగించండి

భామిని: మండలంలోని దిమ్మిడిజోల నుంచి పంట పొలాలకు వెళ్లే పెద్దగోర్జి రహదారి నిర్మాణానికి ఆటంకాలు తొలగించాలని దిమ్మిడిజోల సర్పంచ్ వలరౌతు రజిని, వలరౌతు రామారావుతో పాటు గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ పి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. పంటపొలాలకు వెళ్లేందుకు ఉపయోగించే పెద్దగోర్జిలో ఉపాధిహామీ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న వేతనదారులను కొందరు ఆక్రమణదారులు అడ్డుకొంటున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో రెవెన్యూ అధికారులు పెద్దగోర్జి ఆక్రమణలు తొలగించి కొలత రాళ్లు పాతిన విషయాన్ని గుర్తుచేశారు.

నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే జయకృష్ణ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ శాఖాధికారులతో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రమైన పాలకొండ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీధిదీపాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు ఆదేశించారు. ఎక్కడ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ జరిగిన వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని తహసీల్దార్ వరహాలను ఆదేశించారు.

ఓటింగ్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థుల ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం స్టూడెంట్ లీడర్ల ఎంపికను చేపట్టారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఓటింగ్ ద్వారా స్టూడెంట్ లీడర్లను ఎన్నికున్నారు. నామినేషన్ల ఘట్టం, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, ఓటింగ్ ప్రక్రియను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు పర్యవేక్షించారు. ఎన్నికల అధికారులుగా అధ్యాపకులు బి.ముత్యాలు, ఎ.నర్సయ్య, ఆర్.సంతోస్‌కుమార్, కె.సూరిబాబు వ్యవహరించారు. మొత్తం ఏడు వందల మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం విజేతలకు ప్రకటించారు. మోడల్ స్కూల్ కెప్టెన్‌గా ఇంటర్ విద్యార్థి శ్రీరామ్ వంశీ, వైస్ కెప్టెన్‌గా చెంగల కార్తీక్, స్పోర్ట్స్ కెప్టెన్‌గా పాలక కార్తీక్‌లు ఎన్నికయ్యారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ విధంగా విద్యార్థి నాయకుల ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ బాబూరావు తెలిపారు.

మిశ్రమ పంటలతో ఆదాయం

సీతానగరం: మెట్టు భూముల్లో రైతులు మిశ్రమ పంటలు వేసి అధిక ఆదాయం పొందుతున్నారు. మండల రైతులు ప్రస్తుతం పామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. అయితే మూడేళ్ల వరకు ఈ పంట నుంచి దిగుబడులు రావు. ఈ నేపథ్యంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు పామాయిల్ తోటల్లో అరటి, నువ్వు, కీరదోస, గుమ్మడి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష మాట్లాడుతూ, అంతర పంటల వల్ల ఆదాయం బాగుంటుందన్నారు. మండలంలోని కొత్తవలస, అప్పయ్యపేట, రేపటివలస, దయానిధిపురం, గాదెలవలస, గుచ్చిమి, సీతారాంపురం, రంగంపేట, గెడ్డలుప్పి, సూరంపేట, చిన్నారాయుడు పేట, మరిపివలస, తదితర గ్రామాల్లో మిశ్రమ పంటలు సాగవుతున్నాయని చెప్పారు.